ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 18 సెప్టెంబరు 2025



ప్రభుత్వ స్థలాలకు ఎసరు





కలెక్టరేట్ ఎదురుగా ఉన్న వాటర్ స్ప్రెడ్ స్థలం

- కబ్జాదారులతో అధికారులు కుమ్మక్కు
- కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలు అప్పగించే యత్నం
- కార్పొరేషన్, రెవెన్యూ అధికారుల పూర్తి సహకారం

(కడప-ఆంధ్రజ్యోతి): శివుడాజ్ఞ లేనిదే చీమయినా కుట్టదంటారు. కడప నగరంలో కూడా కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల అన్యాక్రాంతం వెనుక అధికారుల సహకారం ఉందనేది అక్షర సత్యం. అవి ప్రభుత్వ భూములే అని రికార్డుల్లో స్పష్టంగా ఉన్నా.. సుప్రీంకోర్టు తీర్పు మేరకు అక్కడ పట్టాలు ఇవ్వకూడదని నిబంధనలు చెబుతున్నా.. వాటర్ స్ప్రెడ్ ఏరియాకు పన్ను వేయకూడదని గైడ్‌లెన్స్ ఉన్నా సరే.. ఇటు రెవెన్యూ అటు కార్పొరేషన్‌లోని అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి సహకరిస్తున్నారు. వెరసి కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వస్థలాలు కడప నగరంలో కనుమరుగవుతున్నాయి. అవినీతి జబ్బుకు అలవాటుపడ్డ అధికార యంత్రాంగం దిగుడు బావులు, కుంటలు, కాల్వలు ఇలా ఒకటేంటి విలువైన స్థలాలన్నీ అప్పనంగా రాసిచ్చింది. ఇప్పుడు సుమారు రూ.5 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావడంతో మళ్లీ ఒకసారి రెవెన్యూ, కార్పొరేషనులోని అధికారుల అవినీతి గురించి చర్చ నడుస్తోంది. కడప నగరంలో అటు ఆర్టీసీ బస్టాండు, ఇటు వైజంక్షన్ సమీపంలో మృత్యుంజయకుంట ఉంది. రాజీవ్‌మార్గ్, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం నుంచి వచ్చే వర్షం నీరు మృత్యుంజయకుంటకు వెళ్లేది. ఇది పెద్ద కుంట. దివంగత వైఎస్సార్ హయాంలో ఇక్కడ బోటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే అప్పటి కాంగ్రెస్ నేతలు ఆ కుంటపై కన్నేసి విచ్చలవిడిగా ఆక్రమించుకుంటూ వచ్చారు. అదే బ్యాచ్ అనంతరం వైసీపీలోకి వచ్చింది. కార్పొరేషన్‌లో పాలకవర్గం వాళ్లదే. ఆ తరువాత వైసీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఈ సమయంలో కుంట చిన్నగుంత స్థాయికి చేరేలా ఆక్రమించేశారు. ఇక్కడే వైజంక్షన్ సమీపంలో 9 సెంట్ల వాటర్ స్ప్రెడ్ ఏరియా ఉంది. ఇక్కడ సెంటు సుమారు రూ.50లక్షలు పలుకుతుంది. అంటే సుమారు రూ.4.50 కోట్ల పైనే విలువ ఉంటుంది. ఈ స్థలంలో రామసుబ్బారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ భవనం కోసం శంకుస్థాపన చేశారు. తరువాత ఇది నిలిచిపోయింది. మరోసారి ప్రభుత్వ కార్యాలయాల కోసమే శంకుస్థాపన చేశారు.

గతంలో తిరస్కరిస్తే.. ఇప్పుడు సహకరించారు

ఈ స్థలంపైన పట్టాలు పుట్టుకొచ్చాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వాటర్ స్ప్రెడ్ ఏరియాలో ఎలాంటి నివాస పట్టాలు ఇవ్వకూడదు. గతంలో పనిచేసిన తహశీల్దార్లు అడ్డగోలుగా పట్టాలు ఇచ్చారు. ఆ విషయం బయటికి రావడంతో అప్పటి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవడంతో పట్టాల పంచాయితీ ఆగిపోయింది. అయితే వ్యూహాత్మకంగా ఆక్రమణదారులు ఇక్కడున్న ఖాళీస్థలానికి పన్ను వేయాలంటూ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకోగా.. అప్పట్లో కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి సాయి ప్రవీణ్‌చంద్ పరిశీలించి ఇది వాటర్ స్ప్రెడ్ ఏరియా అని పన్ను వేసేందుకు నిరాకరించారు. ఇప్పుడు కార్పొరేషన్ రెవెన్యూలో ఉన్న ఓ అవినీతి అధికారి ద్వారా ఆ స్థలానికి పన్ను వేసుకోగా ఆ వ్యవహారం బట్టబయలైంది. ఆ ఖాళీస్థలంలో కాంపౌండు కట్టించేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.

రూ.12 కోట్ల స్థలంపై మీనమేషాలు

కలెక్టరేట్ సమీపంలోని చిన్నచౌకు సర్వే నెంబర్ 955లో రోడ్డు పక్కనే 23 సెంట్ల వాటర్ స్ప్రెడ్ ఏరియా ఉంది. ఇక్కడ సెంటు రూ.50లక్షలు పలుకుతుంది. అంటే దాదాపు ఇది రూ.12కోట్ల విలువ చేస్తుంది. దీనిని కాజేసేందుకు కొన్ని సంవత్సరాలుగా కొన్ని ముఠాలు అలుపెరగని పోరాటం చేస్తున్నాయి. కబ్జాకు ప్రయత్నించినపుడల్లా ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు రావడంతో బ్రేక్ పడుతూ వచ్చింది. ఈసారి పకడ్బందీగా కడప తహశీల్దారు కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి సహకారంతో పక్కాప్లాన్‌తో కొట్టేయాలని ప్రయత్నించారు. మళ్లీ ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సీరియస్ అయ్యారు. దీంతో ఇక్కడ రెవెన్యూ అధికారులు బోర్డు పాతారు. కొద్దిరోజులుగా ఆ బోర్డు కనుమరుగు చేశారు. మళ్లీ కమ్యూనిస్టు నేతలు ఫిర్యాదు చేయడంతో బోర్డు పెట్టారు. అయితే అక్కడ కట్టడాలు మాత్రం తొలగించలేదు. ఈ రెండు చోట్ల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కావడానికి కడప రెవెన్యూలో పనిచేస్తున్న ఓ కీలక అధికారి, కార్పొరేషన్‌లోని కొందరు అధికారులు సహకరించడం గమనార్హం.



వైజంక్షన్‌లో వివాదాస్పదంగా మారిన వాటర్‌స్ప్రెడ్ ఏరియా

డీజీపీని కలిసిన ఎస్పీ నచికేత్



కడప క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ బుధవారం రాష్ట్ర పోలీసు హెడ్‌క్వార్టర్స్ కార్యాలయంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీజీపీకి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ నూతన ఎస్పీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా శాంతిభద్రతల పర్యవేక్షణపై చర్చించినట్లు తెలిసింది.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బుధవారం జిల్లా బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డీఆర్వో విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ ప్రపంచ తొలి వాస్తుశిల్పి, సృష్టికర్తగా ప్రవచనకారులు దేవశిల్పి విశ్వకర్మను ప్రస్తావించారన్నారు. ప్రపంచపు తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా పేరుగాంచిన విశ్వకర్మ భగవానుడి జన్మదినాన్ని ప్రతి ఏడాది సెప్టెంబరు 17న జరుపుకుంటున్నామన్నారు. విశ్వబ్రాహ్మణ అని కూడా పిలిచే విశ్వకర్మ సంఘం భారతదేశంలో ఒక గొప్ప సామాజిక సమూహంగా ఉందన్నారు. అందులో ఉప సమూహాలైన కమ్మరి, వడ్రంగి, కాంస్య, కమ్మరులు, శిల్పులు స్వర్ణకారులు మొదలైన కులవృత్తుల వారందరినీ విశ్వకర్మ వారసులుగా ప్రస్తావిస్తూ వారి కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకం ద్వారా లక్ష రూపాయల రుణాన్ని ఇస్తోందన్నారు. ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి డీఆర్వో, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసాచారి, ఎస్డీసీ వెంకటపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మితో పాటు విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖాధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ వైద్యశిబిరం ప్రారంభం

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మహిళలు, బాలికల ఆరోగ్య సంరక్షణ కోసం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రీజనల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రాధాకృష్ణ నగర్‌లోని యూపీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ శిబిరాన్ని మెడికల్ ఆర్డీతో పాటు రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ పెంచలయ్య, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భగా మెడికల్ ఆర్డీ మాట్లాడుతూ ఈ శిబిరంలో గర్భవతులకు, మహిళలకు, పిల్లలకు ఆరోగ్య సమస్యలపై స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఆరు నెలల్లో నూతన టెర్మినల్

- కడప విమానాశ్రయం డైరెక్టర్ సుజిత్‌కుమార్



విమానాశ్రయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కడప ఎన్జీఆర్ సర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప విమానాశ్రయంలో మరో ఆరు నెలల్లో నూతన దేశీయ టెర్మినల్ అందుబాటులోకి రానుందని విమానాశ్రయం డైరెక్టర్ సుజిత్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాత్రిసేవా దివస్‌ను దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి విమానాల ద్వారా కడపకు ప్రయాణించిన ప్రయాణికుల అభిప్రాయాలు సేకరించామన్నారు. విమాన సేవలు బాగున్నాయంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారని వివరించారు. అదే విధంగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్యశిబిరం, విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామనానరు. యాత్రీ సేవా దివస్‌ను పురస్కరించుకుని కడప విమానాశ్రయంలో మొక్కలు నాటారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, రామకృష్ణమఠం, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మొక్కలు నాటారు. కడప విమానాశ్రయంలోని సిబ్బంది ప్రయాణికులకు గులాబీ పూలను అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కడప విమానాశ్రయం మేనేజరు దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

వంతెనపైకి సోమశిల జలాలు

- 28 గ్రామాల ప్రజలకు తిప్పలు
- సగిలేరుపై హైలెవల్ బ్రిడ్జి కోసం వేడుకోలు



వేమలూరు దగ్గర సగిలేరు వంతెన పైకి చేరిన సోమశిల వెనుక జలాలు

అట్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని వేమలూరు సమీపంలో ఉన్న సగిలేరు వంతెన పైకి సోమశిల వెనుక జలాలు చేరాయి. దీంతో 28 గ్రామాల ప్రజలకు రాకపోకలు ఆగిపోయాయి. ఈ గ్రామాల ప్రజలు నిత్యం పొలాలకు, మండల కేంద్రమైన అట్లూరు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంది. అట్లూరు తహశీల్దారు కార్యాలయం, ఐకేపీ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయం పోలీసుస్టేషన్ వద్దకు రావాలన్నా.. బద్వేలుకు వెళ్లి అక్కడ నుంచి అట్లూరుకు రావాలి. దీంతో దాదాపు 55 కి.మీ చుట్టూ ప్రయాణించాలి. 30 ఏళ్లుగా సగిలేరుపై వంతెన నిర్మించాలని కోరుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఇక్కడి గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. 2021లో వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ బద్వేలుకు వచ్చినప్పుడు రూ.12కోట్లతో శంకుస్థాపన నిర్వహించారు. అయితే కాంట్రాక్టర్లు టెండరు వేసేందుకు ముందుకు రాలేదు. తట్టెడు మట్టి కూడా వేయలేదు. సగిలేరు వంతెన అవతల గ్రామాలు ముత్తుకూరు, వేమలూరు, కామసముద్రం, మాదాపూర్, మన్యవారిపల్లె, కమలకూరు పంచాయతీల పరిధిలో ఉన్న 28 గ్రామాల ప్రజలు నీటిలో ఉన్న వంతెన దాటి అట్లూరుకు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా వేమలూరు వంతెనపై హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని 28 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వంతెన పైకి చేరిన సోమశిల నీటిని పరిశీలిస్తున్న బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్

వంతెనను పరిశీలించిన ఆర్డీవో

సగిలేరు వంతెనపైకి సోమశిల వెనుక జలాలు చేరడంతో బుధవారం బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. జనాల రాకపోలకు ప్రమాదకరంగా మారడంతో ఎవరినీ అటువైపు వెళ్లనివ్వవద్దని, గ్రామ సహాయకులను కాపలా ఉంచమని అట్లూరు తహశీల్దారు సుబ్బలక్షుమ్మను ఆదేశించారు. స్థానిక వీఆర్వో సుబ్బయ్య, మండల సర్వేయరు వేణుగోపాల్ పాల్గొన్నారు.

కాన్పు అయితే.. కాసులివ్వాల్సిందే

- ప్రసూతి వార్డులో వైద్య సిబ్బంది వసూళ్లు
- పైసలివ్వకుంటే పురిటి బిడ్డను ఇవ్వకుండా వేధింపులు
- తక్కువ ఇచ్చినా ఒప్పుకోక బెదింపులు
- ఇదీ జిల్లా ఆసుపత్రి తీరు



ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలోని కాన్పుల గది

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అవినీతికి నిలయంగా మారింది. అక్కడ వైద్య సిబ్బందితో పాటు స్వీపర్లు రోగులను వేధింపులకు గురిచేసి బెదిరించి మరీ డబ్బులు వసూళ్లు చేస్తున్నారు.

ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అనే పేరే తప్ప.. అక్కడ వైద్య సేవలు నిల్ అనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. అయితే ప్రసూతి వార్డులో మాత్రం గైనకాలజీ డాక్టర్లు కాన్పులు చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు డబ్బులు పెట్టలేక పేదలు ముఖ్యంగా దినకూలి చేసుకునే మహిళలే ఎక్కువగా కాన్పులకు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారు. వారు అక్కడ చేరినప్పటి నుంచి కాన్పు అయి పురిటి బిడ్డ బయటికి రాగానే ఇంక ఏఎన్ఎం, ఎఫ్ఎన్‌వో, స్వీపర్లు చుట్టుకుంటారు. రేట్లు పెట్టి మరీ డబ్బులు వసూలు చేస్తారు. ఏఎన్ఎం రూ.1000, ఎఫ్ఎన్‌వో రూ.600నుంచి రూ.800, స్వీపర్లు రూ.200 నుంచి రూ.300 వరకు డిమాండ్ చేస్తారు. సిజేరియన్ కాకుండా నార్మల్ డెలివరి అయితే మరింత ఎక్కువ డిమాండ్ చేస్తారు. మగబిడ్డ పుడితే ఇంక వారి డిమాండ్ రెట్టింపు అవుతుంది. మా దగ్గర అంత డబ్బులు లేవు మేడమ్ అని బతిమాలినా బాలింతలను చాలా హీనంగా మాట్లాడుతున్నారని ఆరోపిస్తున్నారు. బుధవారం కాన్పు అయిన ఓ మహిళ వారు అడిగినంత ఇవ్వకుండా తక్కువ ఇవ్వడంతో ఆమెను అవమానకరంగా మాట్లాడి ఇచ్చిన డబ్బు ముఖం మీద వేసి వెళ్లారు. దీంతో ఆవేదనకు గురైన ఆ మహిళ తమ బంధువుల నుంచి డబ్బులు తెప్పించి వైద్య సిబ్బందికి ఇచ్చినట్లు తెలిపారు.

పేదలు వైద్యం కోసం వచ్చే ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలా రాబందుల్లా పీక్కుతింటున్నారని దీనిపై వైద్యాధికారులు కఠినంగా వ్యవహరించకపోవడమే కారణమని రోగులు వాపోతున్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అనేక సార్లు మీటింగ్ పెట్టి లంచం డిమాండ్ చేసిన వారికి ఇక్కడ ఉద్యోగాలు ఊడతాయని హెచ్చరించినా వారు బేఖాతరు చేస్తున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు ప్రసూతి వార్డులతో పాటు ఇతర వార్డులలో కూడా సాగుతున్న ఈ వసూళ్లను అరికట్టాలని రోగులు కోరుతున్నారు.

ప్రసూతి వార్డులో వైద్య సిబ్బంది వసూళ్లపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్‌ను వివరణ కోరగా వసూళ్ల గురించి తన దృష్టికి వచ్చిందన్నారు. ఆసుపత్రిలో ఎవ్వరు లంచం అడిగినా తన దృష్టికి తీసుకురావాలని చెబుతున్నా అన్నారు. వార్డులో రోగులను అడిగి ఏ సిబ్బంది ఈ వసూళ్లకు పాల్పడుతున్నారో విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

హత్య కేసులో మహిళకు జీవిత ఖైదు 7

యూరియా వద్దు.. సేంద్రియమే ముద్దు 6

పీఎంఏజీవైకి మోక్షం

- 2020-21లో పనుల గుర్తింపు
- వైసీపీ పాలనలో ఒక్కపనీ ప్రారంభించని వైనం
- కూటమి పాలనలో రూ.1,06,20,000 గ్రాంట్ విడుదల
- ఎస్సీలుండే 33 ప్రాంతాల్లో మౌలిక వసతులకు ఖర్చు



పీఎంఏజీవై పనుల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం

కడపరూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పీఎంఏజీవై) పథకానికి కూటమి పాలనలో గ్రహణం వీడింది. జగన్ ప్రభుత్వం 2020-21, 22లో జిల్లాలో 50 శాతం ఎస్సీలు నివసిస్తున్న 33 గ్రామాలలో పీఎంఏజీవై పథకం ద్వారా రూ.1,06,20,000లు అంచనాతో పలు పనులను గుర్తించింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం దిగిపోయే వరకు ఒక్కపని కూడా మొదలు పెట్టలేదు. దీంతో ఎస్సీలు నివసిస్తున్న ప్రాంతాలు మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ పాలనలో గుర్తించిన పనులకు తాజాగా రూ.1,06,20,000 నిధులు మంజూరయ్యాయి.

జడ్పీ, సాంఘిక సంక్షేమశాఖల ఆధ్వర్యంలో..

పీఎంఏజీవై పథకం అమలును జడ్పీ, సాంఘిక సంక్షేమశాఖలు సంయుక్తంగా చేపడుతున్నాయి. ఈ పథకం ద్వారా చేపట్టే పనులను గుర్తించడం, ప్రారంభించడం, పూర్తి చేయించడం జిల్లా ప్రజాపరిషత్‌శాఖ చేపడుతుండగా.. సంబంధిత పనులకు అయ్యే నిధులను సాంఘిక సంక్షేమశాఖ ద్వారా ఖర్చుచేయనుంది. పీఎంఏజీవై మొదటి దశ పనులకు కూటమి ప్రభుత్వం రూ.1,06,20,000లు గ్రాంట్‌ను తాజాగా విడుదల చేసింది. సంబంధిత పనులకు నిర్దేశించిన ఫార్మాట్‌లో చెల్లింపు చేయాలని పేర్కొంది. సదరు నిధులను జిల్లాలోని 5 మండలాల పరిధిలోని 10 గ్రామ పంచాయతీలలో ఖర్చుచేయనున్నారు.

పంచాయతీల వారీగా నిధులు

రాజుపాలెం మండలంలోని ఏరువపాలెం పంచాయతీకి రూ.13 లక్షలు, వెల్లాల పంచాయతీకి రూ.6.10 లక్షలు, సిద్దవటం మండలంలోని జంగాలపల్లి పంచాయతీకి రూ.10 లక్షలు, నేకనాపురం పంచాయతీకి రూ.5 లక్షలు, ఎస్.రాజంపేట పంచాయతీకి రూ.15 లక్షలు ఖర్చు చేయనున్నారు. అలాగే కలసపాడు మండలంలోని పుల్లారెడ్డిపల్లి పంచాయతీకి రూ.15.05 లక్షలు, సింగరాయపల్లి పంచాయతీకి రూ.15.05 లక్షలు, కమలాపురం మండలంలోని రామచంద్రాపురం పంచాయతీకి రూ.6.50 లక్షలు, చదిపిరాళ్ల పంచాయతీకి రూ.2 లక్షలు, బద్వేలు మండలంలోని వీరాపల్లి పంచాయతీకి రూ.18.50 లక్షలు ఖర్చుచేయనున్నారు.

ఈ నిధులతో ఏం చేస్తారంటే..

5 మండలాల్లోని 10 గ్రామ పంచాయతీల పరిధిలో ఎస్సీలు నివాసం ఉండే 33 ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించనున్నారు. బోరు బావులకు కొత్తమోటార్లు, బోరు బావితో సహ ఆర్‌వో ప్లాంట్స్ ఏర్పాటు, చేతిపంపుల డ్రిల్లింగ్, సోలార్‌లైట్ల ఏర్పాటు, సీసీ ఓపెన్ డ్రైనేజీ నిర్మాణాలు, ఘనవ్యర్థాలను సరఫరా చేసేందుకు మినీ ట్రాక్టర్లు, ట్రాలీలు, తాగునీటి సౌకర్యం కల్పించడం, మంచినీటి పైపులైన్ల ఏర్పాటు, బరియల్‌గ్రౌండ్‌లో మోటారుతో కూడిన షెడ్ ఏర్పాటు చేయనున్నారు.

త్వరితగతిన పనులు పూర్తి

పీఎంఏజీవై పథకం ద్వారా 2020-21, 22లో గుర్తించిన పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరితగతిన పూర్తిచేసేందుకు జడ్పీ, సాంఘిక సంక్షేమశాఖలు సంయుక్తగా చర్యలు చేపట్టాయని జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో కలిసి సంబంధిత మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలతో పనుల నిర్వహణపై సమీక్షించామన్నారు. ప్రభుత్వం రూ.1,06,20,000 గ్రాంట్ విడుదల చేసిందన్నారు. 50శాతం ఎస్సీలు నివసిస్తున్న ప్రాంతాలలో గుర్తించిన పనులను సెప్టెంబరు చివరినాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు.

యూరియా వద్దు.. సేంద్రియమే ముద్దు

యూరియా యూరియా.. ఇప్పుడు రాష్ట్రంలో ఏ మూల చూసినా వింటున్న మాట ఇది. పంటలు సాగు చేసే రైతుల నుంచి విద్యార్థులు, సామాన్యులు కూడా యూరియాపై జోరుగా చర్చలు సాగిస్తున్నారు. పంటల సాగులో కొంత లాభం.. అధిక నష్టం ఇచ్చే యూరియా బదులు సేంద్రియ ఎరువులు వాడితే మంచిదే కదా అన్న మాటలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జిల్లాలో జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్(జెడ్‌బీఎన్ఎఫ్) పథకం కింద ప్రభుత్వం సేంద్రియ ఎరువుల తయారీ, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు ఇస్తున్న విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చు.. అధిక లాభాలు ● సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మొక్కల ఎదుగుదలకు ప్రధాన పోషకపదార్థమైన నత్రజని ఎక్కువగా ఉండే రసాయన ఎరువు యూరియా. మొక్కల ఆకుపచ్చని భాగాలు, కాండాలు పెరుగుదలకు నత్రజని దోహదపడుతుంది. అలాంటి యూరియా ధర బస్తా (45 కిలోలు) సుమారు రూ.2వేలకు పైగా ఉంటుంది. కానీ కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఇచ్చి కేవలం బస్తా యూరియా రూ.266కే పంపిణీ చేస్తోంది. యూరియాను పంటలకు తక్కువ మోతాదులోనే ఉపయోగించాల్సి ఉంది. కాని రైతులు ఎక్కువ దిగుబడులు వస్తాయని ఆశపడి మూడు రెట్లు అధికంగా యూరియా వాడుతున్నారు. తద్వారా యూరియాకు డిమాండ్ పెరగడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతోంది.

యూరియాతో లాభాలివీ..

యూరియాలో 46శాతం నత్రజని ఉంటుంది. ఇతర రసాయన ఎరువులతో పోలిస్తే ఇందులో నత్రజని ఎక్కువ. మొక్కలకు త్వరితగతిన అందుబాటులోకి వచ్చి, తక్కువ మోతాదులో వాడినా మంచి ఫలితాలు వస్తాయి. యూరియా నీటిలో కరిగిపోయి మొక్కలకు త్వరగా అందుబాటులోకి వస్తుంది. ఇతర రసాయన ఎరువుల ధరలతో పోలిస్తే.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో యూరియా ధరలు తక్కువే.

యూరియాతో నష్టాలివీ..

యూరియాను పంట పొలాల్లో చల్లినప్పుడు సరైన పద్ధతిలో నీటిని పారించాలి. లేదంటే యూరియాలోని నత్రజని ఆవిరైపోయి అమ్మోనియా వాయువుగా మారుతుంది. యూరియాను అధిక మోతాదులో వాడటం వలన నేలలో ఆమ్లాల శాతం పెరిగి పంటసాగుకు పనికిరాకుండా పోతుంది. మొక్కల వేర్లను కాల్చివేస్తుంది. యూరియా భూగర్భజలాల్లో కలసి, నీటిని కలుషితం చేస్తుంది.



జీవామృతం తయారు చేస్తున్న రైతులు

సేంద్రియ ఎరువుల ఖర్చు ఇలా..

ఒక ఎకరాలో వరిపంట సాగుకు పశువుల ఎరువు 2 ట్రాక్టర్లు (5 టన్నులు), కోళ్ల ఎరువు 2 టన్నులు, వేపపిండి 300 కిలోలు సరిపోతుంది. పశువుల ఎరువు రూ.6వేలు, వేపపిండి రూ.4వేలు, కోళ్ల ఎరువు రూ.4వేలు.. మొత్తం కలిపి ఎకరా వరిపంట సాగుకు రూ.14వేలు సేంద్రియ ఎరువులకు ఖర్చు చేస్తే సరిపోతోంది.

రసాయన ఎరువుల ఖర్చు..

ఎకరా వరిపంట సాగుకు యూరియా మూడు బస్తాలు, డీఏపీ 50 కిలోలు, పొటాషియం 50 కిలోలు, జింక్ సల్ఫేట్ 10 కిలోలు వాడాలి. ప్రస్తుతం మార్కెట్‌లో యూరియా బస్తా(45కిలోలు) రూ.266, డీఏపీ 50 కిలోలు రూ.1350, పొటాషియం 50 కిలోలు రూ.1650, జింక్ సల్ఫేట్ కిలో రూ.231 పలుకుతున్నాయి. నాలుగు ఎరువులు కలిపి ఎకరాకు రూ.6,108 అవుతుంది. కాని రైతులు మూడు రెట్లు అధికంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో వీరికి ఎకరా వరిపంట సాగుకు రూ.18 వేలు ఖర్చు వస్తోంది.

సేంద్రియ ఎరువులతో లాభాలు

పంటసాగులో సేంద్రియ ఎరువులు వాడితే మట్టిని సారవంతం చేస్తాయి. మట్టిలో ఉండే సూక్ష్మజీవుల వృద్ధికి దోహదపడతాయి. ఎన్ని పంటలు సాగు చేసినా మట్టి ఆరోగ్యంగా ఉంటుంది. సేంద్రియ ఎరువులు మట్టిలో నీటిని ఎక్కువసేపు పట్టి ఉంచేందుకు సహాయపడతాయి. దీంతో మొక్కలకు ఎక్కువసేపు నీరు అందుబాటులో ఉంటుంది. వీటితో సాగయ్యే పంటల నుంచి తయారయ్యే ఆహార పదార్థాలు రుచిగా ఉంటాయి. రసాయన అవశేషాలు వుండవు. సేంద్రియ ఎరువుల తయారీకి సహజ పదార్థాలనే వాడుతారు. దీని వలన పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదు. వీటిని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. తద్వారా ఖర్చు తగ్గి రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుంది.

సేంద్రియానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు

సేంద్రియ ఎరువుల తయారీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వం పరంపరాగత్ కృషి వికాస్ యోజన, నేషనల్ ప్రాజెక్ట్ ఆన్ ఆర్గానిక్



ఫార్మింగ్, నేషనల్ మిషన్ ఆన్ సస్టైనబుల్ అగ్రికల్చర్ పథకాల ద్వారా రైతులకు పలు ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద రైతులు వారి పొలాల్లో వర్మీ కంపోస్టు పిట్స్ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తోంది. సేంద్రియ ఎరువుల తయారీకి, బయో ఫర్టిలైజర్ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం ఇస్తోంది.

ఎక్కువ యూరియా వాడితే నష్టమే

యూరియా కన్నా సేంద్రియ ఎరువుల్లోనే అధికశాతం సూక్ష్మపోషకాలు ఉంటాయి. యూరియా ఎక్కువ మోతాదులో వాడితే పంటకు నష్టమే. తక్కువ యూరియా వాడే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.800 ప్రోత్సాహకం ఇస్తుంది. సేంద్రియ ఎరువులతో భూసారం పెరుగుతుంది. యూరియాతో భూములు బెట్టబారుతాయి.

- కె.నవీన్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, మదనపల్లె మండలం



దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మ: డీఆర్వో



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో మధుసూదన్‌రావు

రాయచోటి నేతాజీసర్కిల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని చేతి, కుల వృత్తుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ విశ్వకర్మ ప్రోగ్రాంను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్టేట్ ప్రోగ్రాంగా ప్రకటించిందని తెలిపారు. హిందూ పురాణాల్లో కృష్ణుడు పరిపాలించిన ద్వారక నగరాన్ని, పాండవుల కోసం ఇంద్రప్రస్థలో రాజభవనాన్ని నిర్మించడంతో పాటు, దేవతలకు అద్భుతమైన ఆయుధాలను విశ్వకర్మ తయారు చేశాడని ప్రతీతి అన్నారు. కుల, చేతి వృత్తుల వారు ఆయనను భగవంతుడిగా భావిస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి సురేశ్, కలెక్టరేట్ ఏవో నాగభూషణం, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు, సిబ్బంది, వివిధ చేతి, కులవృత్తుల సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆదర్శం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ భగవానుడు కేవలం దేవతల శిల్పి మాత్రమే కాదని కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ విశ్వకర్మను నిర్మాణ శాస్త్రానికి ఆద్యుడిగా భావిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, డీపీవో సిబ్బంది నివాళులర్పించారు.

రూ.5 కోట్లతో గురుకుల పాఠశాల భవనం

స్థల పరిశీలన చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ అధికారులు



పీలేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పీలేరులో నడుస్తున్న కేవీ పల్లె గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల కోసం రూ.5 కోట్లతో పక్కా భవనం నిర్మించనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కేవీఎస్ఎన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కేవీపల్లె మండలం సొరకాలయపేట పంచాయతీ బృందావనం వద్ద ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేవీ పల్లె మండలానికి గిరిజన బాలికల గురుకులం మంజూరైనా సొంత భవన నిర్మాణానికి అనువైన స్థలం లేకపోవడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భవన నిర్మాణానికి స్థలం కేటాయించడమే కాకుండా రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించి 18 నెలల్లోపు పూర్తిచేస్తామన్నారు. కేవలం కేవీ పల్లెలోనే కాకుండా నెల్లూరు జిల్లా కావలిలో రూ.4.97 కోట్లు, తిరుపతి జిల్లా మంగళంలో రూ.3.25 కోట్లతో గిరిజన బాలికల గురుకులాల కోసం నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ ధనంజయ రెడ్డి, డీఈఈ మృణాళిని, ఏఈ జాన్, టీడీపీ నేత వగళ్ల చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

చేపలచెరువు వేలంపై డీఎల్‌డీఓ విచారణ



పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం పెద్దచెరువు చేపల వేలం నిర్వహణ గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా సాగిందంటూ రాపూరివాండ్లపల్లె యువకులు కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మదనపల్లె డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ)ను విచారణకు ఆదేశించారు. దీంతో బుధవారం డీఎల్‌డీఓ అమర్‌నాథ్‌రెడ్డి, ఈఓపీఆర్డీ మోహన్ ప్రతాప్‌తో కలిసి రాపూరివాండ్లపల్లెకు చేరుకుని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. గతంలో చేపల చెరువు వేలం దక్కించుకున్న వారిని పిలిపించారు. వారితో పాటు ఫిర్యాదు దారులను పిలిపించి పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వేలంలో పంచాయతీకి రావాల్సిన బకాయిలు తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు దారునితో మాట్లాడి వారు చెప్పిన వివరాలను లిఖిత పూర్వకంగా నమోదుచేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా మలేరియా అధికారి మనోరమ

ఒంటిమిట్ట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోరమ సూచించారు. బుధవారం మండలంలోని చింతరాజుపల్లె హరిజనవాడ, గాండ్లపల్లె గ్రామాల్లో ఆమె పర్యటించి కీటకజనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి లార్వా సర్వే, వైరల్ జ్వరాల సర్వే నిర్వహించారు. ఇక్కడి ప్రజలకు రక్త పరీక్షలు కూడా నిర్వహించి ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి భావనారెడ్డి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు, సూపర్‌వైజర్‌లు భాస్కర్ రెడ్డి, లక్ష్మీనరసమ్మ, ఆరోగ్య కార్యకర్త కరీమున్నీషా, వెంకటసుబ్బయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి వీఆర్‌ఏల దశలవారీ ఉద్యమం

కలికిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి దశల వారీ ఉద్యమాన్ని మొదలు పెడుతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లాబక్ష్, కార్యదర్శి రెడ్డెప్ప తెలిపారు. దీనికి సంబంధించిన కార్యాచరణ రాష్ట్ర సంఘం జిల్లా సంఘానికి అందజేసిందన్నారు. గురు, శుక్రవారాల్లో జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా, ఆందోళనలు చేపడతామన్నారు. చివరి రోజు తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తామన్నారు. 20వ తేదీన ఆర్డీఓ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తామన్నారు. డివిజన్లలోని వీఆర్‌ఏ లందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. 22న కలెక్టరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు, నామినీల నియామకాలు, పదోన్నతులు, కారుణ్య నియామకాలు వంటి సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారం కాలేదని చెప్పారు.

బస్సుకింద పడి మహిళ మృతి



షరీఫా మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అనిల్‌కుమార్

కలికిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు వెనుక చక్రాల కిందపడి షరీఫా (46) అనేమహిళ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఇందిరమ్మ కాలనీ వాసులు షరీఫా, నూరుల్లా బుధవారం స్థానిక బ్యాంకులో పని ముగించుకుని తిరిగి కాలనీకి టీవీఎస్ మోపెడ్‌లో బయలుదేరారు. వెనుక వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వీరిని ఓవర్‌టేక్ చేసే క్రమంలో వెనుక చక్రం కింద మోపెడ్ అదుపు తప్పి పడిపోయింది. దీంతో చక్రాల కింద పడిన షరీఫా తీవ్ర గాయాలకు గురైంది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇక బస్సు కింద పడిన మోపెడ్ నుజ్జునుజ్జయింది. వాహనాన్ని నడుపుతున్న నూరుల్లా తృటిలో తప్పించుకుని స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సంఘటనా స్థలాన్ని, మృతదేహాన్ని సీఐ అనిల్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కారుకింద పడి నుజ్జునుజ్జు అయిన ద్విచక్ర వాహనం

రాయచోటి నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని ఎస్. సోమవరం గ్రామం బాలయ్యగారిపల్లె క్రాస్‌రోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... బుధవారం కలకడ మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి (65) కలకడ సంతకు వచ్చి, ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా రాయచోటి వైపు నుంచి పీలేరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాదుల్లా తెలిపారు.

ఎర్రదుంగలు స్వాధీనం... ఇద్దరి అరెస్టు



పట్టుబడిన దుంగలు, స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కోడూరు అటవీ రేంజ్ పరిధిలోని కేవీ బావి బీట్ అటవీ ప్రాంతంలో 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ సాయి గిరిధర్ తెలిపారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ ఎండీ షరీఫ్, ఏఆర్ ఎస్ఐ మహేశ్వర్ నాయుడు బృందం స్థానిక ఎఫ్‌బీవో నాగేశ్వర నాయక్‌తో కలిసి కూంబింగ్ నిర్వహిస్తుండగా నొక్కోడి గుండం వద్ద ఎర్రచందనం తరలిస్తున్న వ్యక్తులు తారసపడ్డారు. వారిపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మిగిలిన వారు పారిపోయారు. పట్టుబడిన ఇద్దరూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన 10 ఎర్రచందనం దుంగలతో సహా ఇద్దరు స్మగర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రజావాణి సమస్యలకు పరిష్కారం చూపాలి



పెనగలూరు రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

పెనగలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందే సమస్యలను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సూచించారు. బుధవారం సాయంత్రం పెనగలూరు రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో విడివిడిగా సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారంపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. సమావేశం అనంతరం కార్యాలయంలో ఉన్న సిబ్బంది విధులు నిర్వహించే గదులు, కంప్యూటర్ గది, రికార్డు గదులను తనిఖీ చేశారు. సమాచార హక్కు వివరాలు తెలిపే బోర్డు సక్రమంగా లేదని, ప్రజలకు కావాల్సిన సమాచారాన్ని సకాలంలో ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వెన్నర్ల సాయికుమార్‌రెడ్డి జేసీని కోరారు. అందుకు స్పందించిన ఆయన ఈ సమస్యపై వస్తున్న ఫిర్యాదులు పరిష్కరించాలని తహశీల్దారును, డీటీని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు, డీటీ సుమని, ఆర్ఐ రామ్మోహన్, సర్వేయర్ ప్రభాకర్, వ్యవసాయాధికారి వీఎన్‌కే సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వండి : డీజీపీ



డీజీపీకి బొకే అందజేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నేరాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, సురక్షితంగా ఉండే వాతావరణం కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కఠిన నిబంధనల అమలుతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచేలా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. ఈ మేరకు జిల్లాలోని చట్ట వ్యవస్థలను బలోపేతం చేస్తామని, ప్రజలతో సులభంగా అందుబాటులో ఉండే పోలీసింగ్ కొనసాగిస్తామని ఎస్పీ అన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు బోల్తా

● 11 మందికి స్వల్ప గాయాలు



బోల్తాపడిన బస్సును పరిశీలిస్తున్న ఆర్డీవోలు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం భాకరాపేట సమీపంలోని కల్వర్టు వద్ద ఆర్టీసీ అద్దె బస్సు బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్, కండక్టర్ సహా 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బద్వేలు ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు బుధవారం ఉదయం కడపకు వెళుతూ భాకరాపేట సమీపంలోని కల్వర్టు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే యత్నంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెంటనారాయణ, కండక్టర్ శివయ్య, 9 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడినవారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, కడప, బద్వేలు ఆర్డీవోలు జాన్ ఎర్విన్, చంద్రమోహన్, బద్వేల్ ఆర్టీసీ డిపో మేనేజర్ నిరంజన్, సీఐ బాబు, బెటాలియన్ కమాండెంట్ ఆనంద్‌రెడ్డి, ఆర్ అండ్ బి ఏఈ రామాంజనేయులు, డిప్యూటీ తహశీల్దారు మాధవీలత, ఎస్ఐ మహమ్మద్‌రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భాకరాపేట సమీపంలోని కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

మద్యం దుకాణంలో చోరీ



దుకాణం పైకప్పును కత్తిరించిన దృశ్యం

గుర్రంకొండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి మద్యం చోరీ జరిగింది. పట్టణంలోని నబీకాలనీలో మద్యం దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి నిర్వాహకులు మద్యం దుకాణాన్ని మూసేసి తాళం వేసుకుని వెళ్లారు. ఉదయం వచ్చేసరికి మద్యం దుకాణం వాకిలి తీసి చూడగా మద్యం బాటిళ్లు చిందర వందరగా పడివున్నాయి. దుకాణం పైకప్పునకు అమర్చిన రేకును దుండగులు కత్తరించి లోపలికి ప్రవేశించారు. దుకాణంలో కొన్ని మద్యం బాటిళ్లను తీసుకెళ్లినట్లు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మద్యం దుకాణంలో చోరీ జరిగిన తీరును పరిశీలించి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి వివరాలను సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

మద్యంప్రియుల పనేనా...?

పట్టణంలో మద్యం దుకాణంలో జరిగిన చోరీ మద్యం ప్రియులే చేసి ఉంటారని స్థానికులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. చోరీ జరిగిన మద్యం దుకాణం పక్కన, వెనుకనే బెల్టు, సిట్టింగ్ రూములున్నాయి. మద్యం దుకాణం రాత్రి 10 గంటలకు మూసేస్తారు. బెల్టు, సిట్టింగ్ రూములు అర్ధరాత్రి వరకు తెరచి ఉండడంతో మందుబాబులతో కిటకిటలాడుతుంటాయి. ఈ క్రమంలో మద్యం దుకాణం గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడి ఉంటారనేది ప్రజల వాదన. అంతేకాకుండా సిట్టింగ్ రూముతో మందుబాబుల ఆగడాలు అధికంగా ఉన్నట్లు చుట్టు పక్కల నివాసితులు వాపోతున్నారు. బెల్టు, సిట్టింగ్ రూములపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా బెల్టు, సిట్టింగ్ రూములను తొలగించాలని మహిళలు కోరుతున్నారు.



గుర్రంకొండలో చోరీ జరిగిన మద్యం దుకాణం

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు..!

- చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- చిరు వ్యాపారులకు ప్రోత్సాహకాలు
- వ్యాపారాల కోసం రూ.2లక్షల వరకు సాయం

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే విధంగా సీఎం చంద్రబాబు అధికారులకు ఇప్పటికే దిశ నిర్దేశం చేశారు. దీంతో జిల్లాలోని 35 మండలాల్లో పది వేల మందిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనేది లక్ష్యం. కాగా ఇప్పటి వరకు 2,916 మందికి సంబంధించిన దరఖాస్తులను బ్యాంకులకు పంపారు. అందులో 2,828 మందికి రుణం అందించారు. మరో 88 మందికి సంబంధించిన దరఖాస్తులను బ్యాంకర్లు పరిశీలిస్తున్నారు. జిల్లాలో మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించిన రుణాల మంజూరుపై గణాంకాలను పరిశీలిస్తే.. రాజుపాలెం, కొండాపురం, మైదుకూరు, ఎర్రగుంట్ల, పెద్దముడియం, వేంపల్లె, ఖాజీపేట, జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నె, దువ్వూరు, వేముల, కమలాపురం మండలాల్లో యూనిట్ల స్థాపనలో మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయి. ఇక ముద్దనూరు, సిద్దవటం, చెన్నూరు, గోపవరం, లింగాల, బి.కోడూరు, కాశినాయన, మైలవరం వల్లూరు, చాపాడు, పోరుమామిళ్ల, సింహాద్రిపురం, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి మండలాల్లో సింగిల్ డిజిట్‌లో యూనిట్ల ఏర్పాటు జరిగింది. అట్లూరు, బద్వేలు, బి.మఠం, చక్రాయపేట, కలసపాడు, ప్రొద్దుటూరు, పులివెందుల, తొండూరు, వీఎన్‌పల్లె మండలాల్లో ఇప్పటి వరకు ఒక పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు.

ప్రత్యేక సర్వే....

ఈ లక్ష్యసాధనలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వేను చేపడతున్నారు. అధికారులు నేరుగా మహిళలు నిర్వహిస్తున్న పరిశ్రమల వద్దకు వెళ్లి వివరాలు సేకరించనున్నారు. వారు ఎలాంటి వ్యాపారం చేస్తున్నారు, ఎంత ఆదాయం పొందుతున్నారు. ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వంటి కీలక సమాచారాన్ని నమోదు చేసుకుంటారు. ఈ సమాచారం ఆధారంగా యూనిట్లను జీవనోపాధుల, ఎంటర్‌ప్రెన్యూర్, ఎంటర్‌ప్రైజెస్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించి వాటి అభి వృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తారు. ఈ సర్వేలో గుర్తించిన అర్హులైన మహిళలకు తమ వ్యాపారాలను విస్తరించుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించనుంది. బ్యాంకుల ద్వారా కనిష్టంగా రూ.10వేల నుంచి గరిష్ఠంగా రూ.2లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. అంతే కాకుండా స్త్రీనిధి పథకం ద్వారా రూ.లక్ష వరకు, ఎస్సీ ఎస్టీ ఉన్నతి పథకం కింద రూ.2లక్షల నుంచి అవసరాన్ని బట్టి రూ.10లక్షల వరకు కూడా రుణాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే యూనిట్ విస్తరణకు రుణాలు పొందాలంటే ఆ వ్యాపారం ద్వారా కనీసం మరొకరికి ఉపాధి కల్పించాలనే నిబంధనలను పాటించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం జిల్లాలో చాలా మంది మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా డెయిరీ, పచ్చళ్లు, ఆహారశుద్ధి, కలంకారి, పేపరు ప్లేట్లు వంటి చిన్నతరహా పరిశ్రమలను విజయవంతంగా నడుపుతున్నారు. ఈ యూనిట్ల వివరాలను, ఫొటో లను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి పారదర్శకత పాటిస్తున్నారు. ఈ పథకంపై మరింత సమాచారం కావాల్సిన వారు స్థానిక అధికారులను సంప్రదించాలని డీఆర్‌డీఏ అధికారులు సూచిస్తున్నారు.

> వచ్చే మహిళా దినోత్సవానికి వందలాది మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు పరిశ్రమలశాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే చేపడుతున్నారు. స్త్రీనిధి, ఉన్నతి పథకాల కింద మహిళలకు అదనపు రుణాలు అందించి వారిని ఆర్థికంగా శక్తివంతులుగా తీర్చిదిద్దేందుకు ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం



చిరు వ్యాపారాలు చేస్తున్న మహిళలను ప్రోత్సహించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగానే స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండి వ్యాపారాలు మొదలుపెట్టిన మహిళలను గుర్తించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సర్వేలు నిర్వహిస్తున్నాం. వారి అభిరుచులకు అనుగుణంగా వివిధ రంగాల్లో వ్యాపార విస్తరణకు చర్యలు తీసుకుంటున్నాం.

-డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, పీడీ , డీఆర్‌డీఏ

ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులు



పెండ్లిమర్రి మండలం వెల్లటూరులోని మహిళల చేత అగరబత్తుల పరిశ్రమ నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

మహిళలు తమ గృహ పనులతో పాటు అగరబత్తుల పరిశ్రమను విజయవంతంగా నడిపిస్తూ కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపరుస్తున్నారు. ఈ చిన్న స్థాయి పరిశ్రమ ఇప్పుడు గ్రామంలోనే అనేక కుటుంబాలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఇంటి ఆవరణలోనే పరిశ్ర మను నడుపుతూ అగరబత్తులు తయారు చేసి స్థానిక మార్కెట్‌లోకి తీసుకు వెళుతున్నారు. ఈ పరిశ్రమ వల్ల గ్రామంలోని మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు సామాజిక గౌరవం కూడా దక్కుతోంది.



ఖాజీపేట మండలం కొత్తపేటలోని కూసాల కొట్టాలకు చెందిన నాగలక్ష్మమ్మ అనే గిరిజన మహిళ ఉన్నతి ద్వారా లక్ష రూపాయలు రుణం పొంది చీపుర్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేశారు. మొదట ఈమె తన భర్త సుబ్బరాయుడుతో కలిసి కూలీ పనులకు వెళ్లేవారు. పనులు లేని కాలంలో పూట గడవడం కూడా కష్టంగా సాగేది. 2004లో పొదుపు సంఘంలో చేరారు. వెలుగు సిబ్బంది ప్రోత్సాహంతో కొంత మేర రుణం తీసుకుని చీపురు పుల్లల వ్యాపారం ప్రారంభించారు. తరువాత ఉన్నతి ద్వారా మరికొంత రుణాన్ని తీసుకుని వ్యాపారం అభివృద్ధి చేసుకున్నారు. చీపురు పుల్లలను ఏలూరు, విజయవాడ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటు న్నారు, ఒక లోడుకు రూ.50వేల నుంచి మూడున్నర లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు సుబ్బలక్షుమ్మ చెబు తున్నారు. ఇప్పుడు కూలీ పనులు మానేసి వ్యాపారం ద్వారా మెరుగైన జీవనో పాధిని పొందామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా విశ్వకర్మ మహర్షి జయంతి వేడుకలు



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ

కడప క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ పురాణాల్లో దేవశిల్పిగా వర్ణింపబడే విశ్వకర్మ మహర్షి విశిష్ట స్థానం కలిగిన రుషి అని, సమాజానికి కృషి, నైపుణ్యం, సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రతీకగా నిలిచారని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు అన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి అదనపు ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భాద్రపద శుక్ల తృతీయ రోజు విశ్వకర్మ జయంతి జరుపుకుంటారని, కార్మికులు, శిల్పులు, ఇంజనీర్లు, మెకానిక్‌లు, సాంకేతికరంగానికి సంబంధించిన వారు విశ్వకర్మ ను తమ ప్రేరణగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపా రు. అదనపు ఎస్పీ(ఏఆర్) బి.రమణయ్య మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో విశ్వకర్మ మహర్షి సిద్ధాంతాలు, సృజనాత్మకత, పట్టుదల, శ్రమించే తత్వాన్ని అలవరచుకుంటే ఎంత కష్టమైన పని అయినా తేలికగా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శివరాముడు, శ్రీశైల రెడ్డి, టైటస్, సోమశేఖర నాయక్, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల స్థల ఆక్రమణపై పరిశీలన



ఎస్‌ఎస్‌ఏ పీవోకు వివరిస్తున్న మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి

చెన్నూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమంగా రిజిస్టరు చేసుకుని విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆ గ్రామ మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి ఇటీవల మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కడప సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి నిత్యానందరాజు పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల గదులను, పూర్వం పాఠశాల స్థల విస్తీర్ణం, ప్రస్తుతం ఎంత ఉంది, ఎంత ఆక్రమణకు గురైంది అన్న విషయాలపై కూలంకుషంగా పరిశీలించారు. అలాగే పాఠశాల చుట్టూ సచివాలయ సర్వేయరుతో కొలతలు వేయించి ఆ నివేదిక తీసుకున్నారు. అదే సమయంలో మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి పాఠశాల వద్దకు వచ్చి గతంలో ఇదే గ్రామానికి చెందిన దాత పది సెంట్ల స్థలాన్ని పాఠశాల నిర్మాణం కోసం ఇచ్చారన్నారు. అయితే ఇదే గ్రామానికి చెందిన మన్నె విజయభాస్కర్‌రెడ్డి, మన్నె విశ్వనాధరెడ్డి అనే వ్యక్తులు తప్పుడు డాక్యుమెంట్లతో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ఇందుకు స్పందించిన పీడీ మాట్లాడుతూ పాఠశాల స్థల ఆక్రమణకు సంబంధించి నివేదికను ఆర్డీవోకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ డీఈ సుధాకర్‌రెడ్డి, వీఆర్వో లక్ష్మీదేవి, సర్వేయరు రామచంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకం అద్భుతం

- ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు



కడప మారుతీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన స్త్రీశక్తి పథకం అద్భుతమని ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూలనాగరాజు అన్నారు. స్త్రీశక్తి పథకం అమలు చేసి నెలరోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం చేసేందుకు వీలుగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. ఈ పథకం దిగ్విజయం కావడానికి ఆర్టీసీ పైస్థాయి నుంచి కింది స్థాయి ఉద్యోగుల కృషి దాగి ఉందన్నారు. నెల రోజుల్లో కడప జోన్ పరిధిలో సుమారు 22 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసినట్లు వెల్లడించారు. దీంతో జోన్‌కు సుమా రు రూ.262 కోట్లు ఆదాయం రాగా.. ఇందులో రూ.82 కోట్లు జీరో టికెట్ కింద ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన సూపర్‌సిక్స్, సూపర్ హిట్ బహిరంగసభకు దాదాపు 3200 బస్సులు నడిపామన్నారు. దీంతో ఆర్టీసీకి మంచి ఆదాయం చేకూరిందన్నారు. ముఖ్యంగా కడప జోన్‌లో దాదాపు 500 బస్సులు అవసరమని, కండక్టర్లు, డ్రైవర్లు కొరత కూడా ఉందన్నారు. కార్యక్ర మంలో ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు పాడి పశువుల పంపిణీ

- డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు 12వేల పాడి పశువులను పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక పీజీఆర్‌ఎస్ భవనంలో డీఆర్‌డీఏ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడిపశువులను గ్రౌండింగ్ చేయడం కోసం గ్రామ, మండల స్థాయిలో లబ్ధిదారుల కు తగిన అవగాహన కల్పించాలని వెలుగు సిబ్బందికి సూచించారు. ప్రణాళికాబద్ధంగా ఈనెల 30 నాటికి గ్రౌండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వెలుగు ఏపీయంలతో వివిధ పథకాలపై సమీక్ష నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ మాట్లాడుతూ వెలుగు సిబ్బంది గ్రౌండింగ్ చేసే పాడి పశువులకు తమ శాఖపరిధిలోని డిప్యూటీ డైరెక్టర్లు, ఏడీలు మండలస్థాయిలో పశువైద్యులు వారి శాఖకు సంబంధించిన అనుబంధ పనులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఎల్‌డీఎం జనార్ధన్ మాట్లాడుతూ వెలుగు సిబ్బందికి కావాల్సిన బ్యాంకు రుణాలు మంజూరు చేయడంలో జాప్యం జరగకుండా చూస్తామన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు ఆర్‌ఎం, పశు సంవర్ధకశాఖ డీడీలు, ఏడీలు, డీఆర్‌డీఏ ఏపీడీ, వెలుగు డీపీఎంలు, ఏపీయంలు హాజరయ్యారు.

టెంకాయల వేలం వాయిదా

చక్రాయపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో బుధవారం నిర్వహించిన టెంకాయల వేలంపాట వాయిదా వేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. గత ఏడాది టెంకాయల వేలం రూ.80 లక్షలకు పలికిందన్నారు. ఈ ఏడాది రూ.80 లక్షల నుంచే వేలం పాట మొదలు పెట్టగా.. ఎవరు ముందుకు రాకపోవడతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ప్రధాన అర్చకులు కేసరి, పోలీసు, బ్యాంకు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్ ఆడిట్ అంశాలపై సమీక్ష

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదలపై బుధవారం రాష్ట్రస్థాయి చీఫ్ కో ఆర్డినేటర్ చిన్నారావు జిల్లా రెవెన్యూ అధికారులతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లాకు సంబంధించి నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ఆడిట్ అంశాలపై ఆరా తీశారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు.

డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విద్యార్థులకు సీఓఏ అనుమతులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి చెందిన 2020-21, 2021-22, 2022-23 బ్యాచ్ విద్యార్థులకు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) కోర్సు అనుమతులు, ఎన్‌రోల్‌మెంట్ నెంబర్లు మంజూరయ్యాయని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, ఉన్నత విద్యా ప్రధాన కార్యదర్శి కోన శశిధర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షంతో రద్దయిన కర్నూలు - చిత్తూరు మ్యాచ్

- డ్రాగా ముగిసిన కడప -అనంతపురం మ్యాచ్

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్ జోన్ అండ్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆటకు చివరి రోజు బుధవారం కర్నూలు, చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్ వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోయింది. కడప, అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

హత్య కేసులో మహిళకు జీవిత ఖైదు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఓ మహిళకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా మూడవ అదనపు జడ్జి ప్రవీణ్‌కుమార్ తీర్పు నిచ్చారు. పట్టణ సీఐ నాగార్జున కథనం మేరకు వివరాలిలా... రాజంపేట పట్ట ణంలోని ఎర్రబల్లెలో నివాసం ఉంటున్న నర్రెడ్డి సుమిత్రమ్మను 2019 సంవత్స రంలో ఆమె వియ్యంకురాలు వెలిచెలమల ఇందిరమ్మ ఇంట్లో ఎవరూ లేని సమ యంలో హతమార్చి, ఇంట్లోని బంగారు సరుడు, డైమండ్ నెక్లెస్, ఒక జత చెవి కమ్మలు, వెండి దీపాలు దొంగలించి, ఇంట్లో దొంగలు పడి నగలు అపహరిం చడమే కాకుండా హత్య చేశారని నమ్మించింది. మృతురాలి కుమారుడు మహీ ధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అప్పటి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేశారు. ఈ కేసు చార్జిషీట్‌లో ఐదుగురు నిందితులుండగా, ఇందిరమ్మ నేరం చేసినట్లు రుజువు కావడంతో ఆమెకు జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సచివాలయ సిబ్బందికి పీ-4 బాధ్యతలు

- అవగాహన సదస్సులో సీపీవో హజరత్తయ్య



పీ4 శిక్షణలో మాట్లాడుతున్న సీపీవో హజరత్తయ్య

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచి బంగారు కుటుంబాలుగా తీర్చే క్రమంలో సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకమని జిల్లా ప్రణాళికాధికారి హజరత్తయ్య పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు తీసుకుంటున్న పీ4 పాలసీకి సంబంధించి సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ పీ4 పథకం అమలులో పేదరికంతో ఉన్నవారిని బంగారు కుటుంబాలుగా, వారికి తోడ్పాటునందించే మార్గదర్శుల సమన్వయ బాధ్యతలను చేసుకోవాలన్నారు. బంగారు కుటుంబాలకు, మార్గదర్శులకు సమన్వయకర్తలుగా సచివాలయ ఉద్యోగులు కీలకపాత్ర పోషించి లక్ష్యాలను సాధించాలన్నారు. క్లస్టర్ వారీగా మార్గదర్శులు, బంగారు కుటుంబాలను విభజించి కార్యదర్శులకు బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారులు, సచివాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

పారా మెడికల్ డిప్లామా కోర్సులకు దరఖాస్తులు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కళా శాలల్లో పారా మెడికల్ రెండేళ్ల కోర్సులకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. ఈ మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబం ధించి రాష్ట్ర ప్రభుత్వ పారా మెడికల్ బోర్డు నోటిఫి కేషన్ విడుదల చేసిందన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ పాసైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన విద్యార్థులకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో శిక్షణ కోర్సులు ఇస్తారని తెలిపారు. దరఖాస్తు గడువు పెంచినందున అసక్తి గల విద్యార్థు లు ఈనెల 27 వతేదీ సాయంత్రం 5గంటల లోపు కడప డీఎంహె చ్‌వో కార్యాలయంలో అందజేయాలన్నారు.

హార్టికల్చర్ డీడీగా సతీష్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సతీష్

కడప రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ డిప్యూటీ డైరక్టర్ (డీడీ)గా జి.సతీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉద్యాన శాఖ సహాయ సంచాలకులుగా (ఏడీ)గా ఉంటూ పారిన్ సర్వీస్‌పై చిత్తూరు జిల్లా ఏపీఎంఐపీ పీడీగా పనిచేస్తున్న ఈయనకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ డీడీగా పదోన్నతి కల్పించి వైఎస్ఆర్ కడప జిల్లాకు నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పద్య పఠన పోటీల్లో వీరమల్లు గౌరికి రాష్ట్ర స్థాయి బహుమతి



బహుమతి సాధించిన గౌరితో ప్రిన్సిపాల్

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనిపెంట బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వీరమల్లు గౌరి రాష్ట్రస్థాయి తెలుగు పద్య పఠన పోటీలలో ప్రథమ బహుమతి సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ నిర్మల తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆన్ లైన్ ద్వారా నిర్వహించిన ఈ పోటీల్లో గౌరి మంచి ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి సాధించిందన్నారు. అలాగే మూడు భాషల్లో జిల్లా స్థాయిలో కూడా ప్రథమ స్థానం సాధించిందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు ప్రత్యూష, గౌరి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

యూరియా రాయితీ... రైతులను మోసం చేయడమే!

- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి అవసరమైనంత యూరియా సరఫరా చేయకుండా వాడకాన్ని తగ్గించుకుంటే రూ.800 రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఊరించడం రైతులను వంచించడమే అని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో యూరియా వాడకం తగ్గిస్తే బస్తాకు రూ.800 రాయితీ ఇస్తామని చెప్పడం రైతులను మభ్యపెట్టడానికే అన్నారు. కేంద్రం నుంచి రూ.500 కోట్లు తీసుకొని రైతులకు యూరియా వాడకాన్ని తగ్గించుకోమని చెప్పడం దారుణమన్నారు. వ్యవసాయాభివృద్ధికి, ఆహార ధాన్యాల ఉత్పత్తికి కీలకమైన ఎరువులను అవసరమైనన్ని సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. క్యాన్సర్ రావడానికి అనేక కారణాలు ఉన్నాయని, యూరియా వాడకంతో వస్తుందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలేవని, ఒకవేళ అదే నిజమైతే ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. భవిష్యత్తులో ఎరువులకు ప్రభుత్వాలు నగదు బదిలీ విధానాన్ని తెచ్చే ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

బొలెరో క్యాంపర్ బోల్తా.. ఒకరు మృతి

చక్రాయపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువు కాంప ల్లె వద్ద బొలెరో క్యాంపస్ బోల్తాపడిన ఘటనలో అజయ్ అనే కూలి మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరా లిలా.. మండలంలోని గండికొవ్వూరు-కుమార్లకాల్వ వద్ద సీఆర్ కంపెనీకి చెందిన బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. ఈ పనుల కోసం యూపీ నుంచి కూలీలు వచ్చారు. నీటి కోసం వేంపల్లె వైపు వెళ్తున్న క్రమంలో చెరువు కాంపల్లె వద్ద క్యాంపర్ బోల్తాపడింది. ఈఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పది మంది కూలీలకు గాయాలయ్యాయి. వీరిని వేంపల్లె ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. అజయ్ అనే కూలి చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషయంగా ఉన్నట్లు తెలిపారు. ప్రమా దస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.10 వేలు ఆర్థికసాయం


ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం టీడీపీ నాయకుడు చెప్పగిరి శ్రీనివాసులకు టీడీపీ ఉపాధ్యక్షుడు, 15వ డివిజన్ ఇన్‌చార్జి కొండాసుబ్బయ్య, 47వ డివిజన్ ఇన్‌చార్జి జనార్దన్‌రెడ్డిలు రూ.10 వేలు ఆర్థికసహాయం అందించారు. బుధవారం అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాసులును, ఆయన సతీమణి మీనాక్షికి ధైర్యం చెబుతూ తమవంతుగా రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ విషయాన్ని జిల్లా నాయకుల ద్వారా పార్టీ అధిష్టానానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

బకాయిలు చెల్లించండి

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు సకాలంలో వైదయం అందేలా, నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలని సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తక్షణమే జోక్యం చేసుకొని పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నిటిని చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఐవైసీఎఫ్‌పై అవగాహన

చక్రాయపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లమడక గ్రామంలో గర్భిణీలు, బాలింతలకు, ప్రజలకు ఐవైసీఎఫ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసం-2025 పోషణ్ మాసోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లిపాలు బిడ్డకు ఇచ్చే పద్ధతులు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మారెళ్లమడక సర్పంచు నరసింహ, చక్రాయపేట డాక్టర్ వి.వాణి, సీహెచ్‌ఓ వేణుగోపాల్, మలేరియా ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎస్.శ్రావణి, పి.నాగసుభాషిణి, అంగన్వాడీ వర్కర్స్, ఏఎన్ఎం, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

మహిళల కోసమే స్వస్థనారీ - సశక్తి పరివార్

● ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి


క్యాంపునుద్దేశించి సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, చిత్రంలో డీఎంహెచ్‌వో నాగరాజు

వల్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్వస్థనారీ - సశక్తి పరివార్ అభియాన్ మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారని ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు డీఎంహెచ్‌వో నాగరాజుతో కలిసి బుధవారం ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి శిబిరం వద్దకు వెళ్లి ఆయా శిబిరం స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదిన సందర్భంగా ఇలా ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆడబిడ్డల ఆరోగ్యం కోసమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు.ప్రతి మండలంలో ఒక మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, ఏఎన్ఎం, ఆశావర్కర్లు తమ గ్రామ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఆ ఇంట్లోని మహిళలకు ఈ మెడికల్ క్యాంపు ఆవశ్యకత గురించి వివరించాలన్నారు. అలాగే జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ రావు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీవో రఘురాం, స్థానిక డాక్టర్లు లక్ష్మీప్రసన్న, డాక్టర్ ఫణీంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు, మండల సహకార బ్యాంకు అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, టీడీపీ మండల నాయకులు సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, విజయేంద్రరెడ్డి, సునీల్‌రెడ్డి, రాఘవరెడ్డి, నాగరాజు, రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ రామక్రిష్ణారెడ్డి, యల్లారెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, తదితర పుత్తా అనుచరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించమంటే అక్రమ కేసులా

● కార్పొరేటర్ సుజాత, వైసీపీ నేత సుబ్బరాయుడు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానికులకు ఇబ్బందికరంగా ఉన్న సమస్యను పరిష్కరించమని చెబితే అక్రమ కేసులు పెట్టడం దారుణమని 21వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ సుజాత, డివిజన్ ఇన్‌చార్జి సుబ్బరాయుడు తెలిపారు. తాను డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆధారాలు చూపకపోతే వారిపై పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. బుధవారం కడప నగరం సీపీ బ్రౌన్ గ్రంథాలయ ఎదుట వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలు చెప్పగానే అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. మాజీ సీఎం జగన్ రూ.6.66 కోట్లు మంజూరు చేసి గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. కానీ ఆయన వేసిన శిలాఫలకాన్ని దాచిపెట్టారన్నారు. కూలీలకు వసతులు లేక ఎక్కడపడితే అక్కడ కాలకృత్యాలు చేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిర్మాణ సామగ్రిని ప్రైవేటుస్థలంలో అక్రమంగా నిల్వ చేశారని, స్థల యజమాని అభ్యంతరం చెప్పడంతో ఖాళీచేశారని, తనపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. తనపై వచ్చిన ఆరోపణలు రుజువు చేయకపోతే పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

దసరా కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

● ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం

కడపఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా గురువారం జరగబోయే కేబినెట్ సమావేశంలో 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, వెంటనే 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలని పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి సుధా ఇలియాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డి.రామాంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, భోగా వెంకట సుబ్బయ్యలు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన నాలుగు డీఏలు, డీఆర్‌లు పెండింగ్‌లో ఉన్నాయని విమర్శించారు.

ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి మేలు జరగలేదని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర నేతలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ వెంకటజనార్దన్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంకిరెడ్డిపల్లె మదన్‌మోహన్‌రెడ్డి, బి.ఖాదర్‌బాష ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రహదారులకు మహర్దశ : జోగిరెడ్డి

సింహాద్రిపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వంలో రహదారులకు మహర్దశ వచ్చిందని తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బిదినంచెర్ల - దంతలపల్లి, బిదినంచెర్ల - బోనాల గ్రామాల మధ్య ఏర్పాటు చేయనున్న రోడ్డు పనులకు జోగిరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, కందుల ఓబుల్‌రెడ్డి, రమణారెడ్డి, జమ్మలమడుగు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్‌లు వారధిగా పనిచేయాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫార్మసిస్టులు.. వైద్యులు, రోగులకు మధ్య వారధిలాగా పనిచేయాలని రిమ్స్ కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ తెలిపారు. స్థానిక రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో ఔషధ భద్రత వారోత్సవాల సందర్భంగా బుధవారం 5వ ఔషధ భద్రత పర్యవేక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెప్టెంబరు 17-23 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని, ఇందులో రోగుల భద్రతపై ఎప్పటికప్పుడు రిపోర్టు తయారు చేసి అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నెల్సన్‌కుమార్, ఫార్మ్‌డి హెచ్‌వోడీ రాజారాం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సును బహిష్కరించిన రైతులు

వేంపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును రైతులు బహిష్కరించారు. రైతుల సమస్యలు పరిష్కారం కోసం తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు బుధవారం రామిరెడ్డిపల్లె గ్రామ సచివాలయానికి వెళ్లారు. అక్కడకు వచ్చిన రైతులు గత రెవిన్యూ సదస్సులో ఇచ్చిన ఏ ఒక్క సమస్య ఎందుకు పరిష్కరించలేదంటూ అధికారులను ప్రశ్నించారు. కాసేపు కూర్చొని తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ ఉద్యోగులు వెళ్లిపోవడంతో సచివాలయాన్ని రైతులు మూసేశారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై కుటుంబంలో ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం స్వస్థనారీ -సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సుప్రీత, డాక్టర్ బాలాంజనేయులు, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీత, స్త్రీ, శిశుసంక్షేమశాఖ పర్యవేక్షకులు శ్రీదేవి, లక్ష్మీదేవి, సీహెచ్ఎస్ నాగరత్న పాల్గొన్నారు.

పులివెందులరూరల్: మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతి మహిళ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలాజీ, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, ఉప ఆరోగ్య విద్యాధికారి మల్లయ్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు: మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం కేంద్రం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ నెల 17 నుండి అక్టోబరు 2వరకు జరిగే స్వస్థనారీ, సశక్తి పరివార్ అభియాన్‌ను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక 3వ సచివాలయ విలేజీ క్లినిక్‌లో బుధవారం ఈ కార్యక్రమాన్ని టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

వేంపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్య ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతనిధి తులసిరెడ్డి తెలిపారు. వేంపల్లెలోని కందుల ఓబుళరెడ్డి ఐటీఐలో 2023-25 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

చెన్నూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే ట్రాయ్ (టెలికాం రెగ్యులేటరీ ఆఫ్ ఇండియా)లక్ష్యమని ట్రాయ్స్ ఏజీ మెంబరు శారద అన్నారు. స్థానిక వెలుగు ఆఫీసులో బుధవారం టెలికాం వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులు మనకు తెలియని కాల్స్‌ను ఎటువంటి పరిస్థితుల్లో తీయకూడదన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కడప కెనరాబ్యాంకు ఎల్ఎఫ్‌సీ వీరప్రసాద్, ఏజీ శారద, మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

అవసరం మేరకే యూరియా

వేముల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంట సాగులో అవసరం మేరకు యూరియా వాడాలని మండల వ్యవసాయాధికారి జీపీ ఓబులేసు సూచించారు. బుధవారం మండలంలోని గుండ్లపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ యూరియా అధిక మోతాదులో వాడితే దోమ తెగులు సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీఏఏ సంతోష్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ పరిశీలన

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మనగ్రోమోర్ సెంటర్ ద్వారా నిర్వహిస్తున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఎస్ఐ మంజునాథ్, మండల వ్యవసాయాధికారి శ్యామ్ బాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల ద్వారా 79.2 మెట్రిక్ టన్నుల యూరియా, ప్రైవేట్ డీలర్ల ద్వారా 79.2 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని తెలిపారు. యూరియా కొరత లేదని, అవసరానికి మించి యూరియా వాడరాదన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కమలాపురంరూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతో ఆరోగ్యమని, వారి ఆరోగ్య రక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పోషణ మాసం నిర్వహిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజరు జయకుమారి అన్నారు. బుధవారం స్థానిక 1వ సచివాలయ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని గర్భవతులకు సీమంతాలు, బాలింతలకు పౌష్టికాహారం అందించి చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశాకార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో: గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని వైద్యాధికారి పృథ్వీ కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వర్ణలత పేర్కొన్నారు. వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. రక్తహీనత పరీక్షలు, బీపీ షుగర్ వంటి పరీక్షలను చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ, హెచ్‌ఈ షఫివున్నీస, కళావతి, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. నందిమండలం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు వీధులన్నీ బురదమయం కావడంతో బుధవారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో వర్షపు నీటిని, బురదను, కంపచెట్లను ఎక్సకవేటర్లతో తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టపరంగా చర్యలు తీసుకోండి

కడపమారుతీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కమీషన్ ఇవ్వలేదనే కక్కుర్తితో తెలుగు భాషకు ఎనలేని సేవలందించిన సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని అడ్డుకున్న 21వ డివిజను కార్పొరేటరు భర్తపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు రమేశ్, అక్షయ్‌కుమార్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం: బీజేపీ

పులివెందులరూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రధాని జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి ప్రపంచంలో విశ్వగురువుగా నిలిపేందుకు మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రక్తదాన శిబిరంలో పెద్దఎత్తున రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, మండల అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబాభివృద్ధి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి


స్వస్థ్‌నారీ స్వశక్త్ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి తదితరులు

కడపఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం, సమాజం బలపడుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరంలో డీఎంహెచ్‌ఓ, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్య రక్షణలో ఈ అభియాన్ ఒక గొప్ప ముందడుగు అన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ సంబంధ వ్యాధుల నిర్ధారణతో పాటుఅంగన్వాడీ సెంటర్‌లో పిల్లలకు పోషకాహారం, ఆరోగ్య సూచనలు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఆరోగ్య రంగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల వద్దకే సేవలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, స్థానికులు, ఆరోగ్య సిబ్బంది పెద్దఎత్తున పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం


ప్రజాదర్బార్‌లో సమస్యలు వింటున్న బీటెక్ రవి

పులివెందుల, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి రెండింటిని రెండుకళ్లలా చూడడం సీఎం చంద్రబాబుకే చెందుతుందని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు వ్యక్తిగత సమస్యలను విన్నవించుకున్నారు. ఆ సమస్యలపై వెంటనే స్పందిస్తూ సంబంధించిన అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో తుంగభద ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ కమిటీ చైర్మన్ జోగిరెడ్డి, పులివెందుల జడ్పీటీసీ లతారెడ్డి, పలువురు నాయకుల, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి బలోపేతానికి కృషి చేయాలి

వేంపల్లె,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల మరింత బలోపేతానికి మరింత కృషి చేయాలని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సూచించారు. పులివెందులలో ఉన్న బీటెక్ రవిని ఇడుపులపాయ మాజీ సర్పంచు, జనసేన నాయకులు పోతిరెడ్డి చలపతి, ఆయన అనుచరులు కలిశారు. బీటెక్ రవిని శాలువ,పూలమాలలతో సత్కరించారు. స్థానిక సమస్యలపై చర్చించారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

● ఎంహెచ్‌ఓ రమేష్


పారిశుధ్య కార్మికులకు సూచనలు ఇస్తున్న ఎంహెచ్‌ఓ

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పారిశుధ్య కార్మికులు అప్రమత్తగా ఉండాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ రమేష్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలో ఆకస్మిక పర్యటన చేపట్టారు. గౌస్‌నగర్, ఓల్డ్ రిమ్స్, శంకరాపురం, చిన్నచౌక్ ప్రాంతాలను సందర్శించి పరిశుభ్రతపై సమీక్ష నిర్వహించారు. సిబ్బంది హాజరు పరిశీలన తనిఖీలలో భాగంగా శానిటేషన్ సిబ్బంది హాజరును పరిశీలించిన ఎంహెచ్‌ఓ పనులను నిర్లక్ష్యం చేయవద్దని స్పష్టం చేశారు. సమయానికి పనికి హాజరుకావాలని, విధుల్లో అలసత్వం కనబరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మురుగునీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాల్వల శుభ్రత, చెత్త తొలగింపు, పరిశుభ్రత పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

జర్మన్‌లో నర్సింగ్‌కు అత్యంత ప్రాధాన్యత

● ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శేషాద్రి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జర్మన్‌లో నర్సింగ్ వృత్తికి అత్యంత ప్రాధాన్యత ఉందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శేషాద్రి తెలిపారు. బుధవారం రిమ్స్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఎండీ ఇంతియాజ్ అహ్మద్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా కందులు పంపిణీ

పులివెందుల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన కందులను 75 మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తెలిపారు. బుధవారం పెద్దరంగాపురం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగు చేసిన ప్రతిపంటను ఈ-క్రాప్ చేయించుకోవాలని, అలాగే యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన ఆర్ఎస్‌యూ 10వ రాష్ట్ర మహాసభల్లో ఉమ్మడి కడప జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం అనంతసముద్రం గ్రామానికి చెందిన తొండంనాటి ప్రశాంత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మూడు రోజుల పాటు జరిగిన మహాసభల్లో విద్యార్థి ప్రదర్శనలు, ప్రతినిధుల సభ, భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పన జరిగింది. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికై పోరాటాన్ని కొనసాగిస్తానన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

వేంపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అవినీతి మరకలు లేకుండా దేశాభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సేవలు ఈ దేశానికి ఎంతో అవసరమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. మోదీ జన్మదినం పురస్కరించుకొని వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీలో పేదలకు అన్నదానం చేశారు. దొంతుసుమన్, సునీల్, చంద్ర పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కార్పొరేషన్ ఉద్యోగులు


ఆర్థిక సహాయం అందిస్తున్న సిబ్బంది

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి గురైన సహోద్యోగి కుటుంబానికి కడపనగరపాలక సంస్థ ఉద్యోగులు ఆదర్శంగా నిలిచారు. అడిషనల్ కమిషనర్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్న వై.మణికంఠ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంలో కార్పొరేషన్, సచివాలయ ఉద్యోగులు కలిసి రూ.1.50 లక్షలను మణికంఠ కుటుంబానికి అందించారు. ఈ సహాయం మరింత చికిత్సకు ఉపయోగపడాలని ఉద్యోగులు ఆకాంక్షించారు. కాగా మణికంఠ కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అందుబాటులో యూరియా : ఏడీఏ

కమలాపురంరూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో యూరియా ఉందని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సంబటూరు రైతుభరోసా కేంద్రంలో మన గ్రోమోర్ సెంటర్లను విజిలెన్స్, వ్యవసాయశాఖ సంయుక్తంగా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో ఈ పాస్ మిషన్ ద్వారా స్టాకు రిపోర్టును సేకరించి ఫిజికల్ స్టాకును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులుకొనుగోలు చేసిన ఎరువులకు దుకాణదారుడు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. మండల పరిధిలోని చదిపిరాళ్ల, రామచంద్రాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో ఖాజాహుసేన్, డీసీటీవో ఓబులేసు, మండల వ్యవసాయాధికారి సరస్వతి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు అఖిశ, రైతులు పాల్గొన్నారు.

వాహన మిత్రకు రేపే ఆఖరు

కొండాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకానికి శుక్రవారం లోపల దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. మోటర్‌క్యాబ్ యజమానులు, ఆటో యజమానులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. యజమానులు ఆర్సీ, ట్యాక్స్, ఫిట్‌నెస్ తప్పనిసరిగా వుండాలని, వాహనాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవై ఉండాలన్నారు. దరఖాస్తులను సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కు సమర్పించి ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

నేటి నుంచి వైద్యశిబిరాలు

ముద్దనూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు పురస్కరించుకొని రెండు వారాలు స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కరిష్మా తెలిపారు. 18వ తేదీ శెట్టివారిపల్లె, 19న కొలవలి, 20న తిమ్మాపురం, 22న పెనికెలపాడు-1, ముద్దనూరు, 23న పెనికెలపాడు-2, 24న నల్లబల్లె, 25న కొర్రపాడు, 26న బొందలకుంట, 27న ఉప్పలూరు, 29వ తేదీ యామవరంలో ఈ వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బి.కోడూరులో...

బి.కోడూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మండలంలో నేటి నుండి ప్రారంభిస్తున్నట్లు వైద్యాధికారులు వినీత్‌కుమార్ రాజు, ఉదయకిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ మహిళలకు వైద్యపరీక్షలు, కంటి పరీక్షలు, రక్తపోటు, రక్తంలో చక్కెర, దంత పరీక్ష, క్యాన్సర్, గర్భశయం తదితర పరీక్షలు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండలానికి 1056 బస్తాల యూరియా

రాజుపాలెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం మండలంలోని రైతు సేవా కేంద్రాలు, ఫర్టిలైజరు దుకాణాలకు బుధవారం 1056 బస్తాల యూరియాను అందించినట్లు ఏవో శివరామక్రిష్ణరెడ్డి తెలిపారు. వెలివలి గ్రామంలోని రైతు సేవాకేంద్రం, మదీనా ఫర్టిలైజర్ రైతు సేవాకేంద్రం, టంగుటూరు, కూలూరు గ్రామ రైతులకు రాజుపాలెం మన గ్రోమోర్ కేంద్రంలో యూరియా అందించినట్లు తెలిపారు.

సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువలకు శంకుస్థాపన

మైదుకూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా రూ.23,35,000 వ్యయంతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువలకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి విడతగా విడుదలైన రూ.1.87కోట్ల నిధుల నుండి ఈ పనులకు రూ.23,35,000 కేటాయించి 7, 8, 9 వార్డుల పరిధిలో శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏపీ రవీంద్ర, మారుతీ, కౌన్సిలర్ సుమలత, గుండం రాజుసుబ్బయ్య పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కాశినాయన, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని ఒక అనాథ వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు వివేకానంద ఫౌండేషన్ సభ్యులు. నంద్యాల జిల్లా కానాల మండలం హైస్కూల్ కొట్టాల గ్రామానికి చెందిన నరసమ్మ (90)కు ఎవరూ లేకపోవడంతో ఓబుళాపురం సమీపంలోని వివేకానంద సేవాశ్రమంలో చేరింది. అనారోగ్యంతో బుధవారం మృతి చెందడంతో సంస్థ ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో రామక్రిష్ణారెడ్డి, వీరస్వామి, వెంకటేశ్వర్లు, చిన్ని, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యంతో కుటుంబానికి శక్తి

● 'స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


జమ్మలమడుగులో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న భూపేశ్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న మహిళ ఆ కుటుంబానికి ఒక శక్తిలా తయారవుతుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా మండలంలోని గోపవరంలో ఏర్పాటు చేసిన స్వస్థనారీ సశక్తిపరివార్ అభియాన్ వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటా స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యశిబిరంలో సుమారు 311మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ గీత పర్యవేక్షించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ శ్రీనివాస్, కమ్యూనిటీ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, పట్నం లక్ష్మణ్‌కుమార్, వీరప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం చాలా అవసరం

జమ్మలమడుగు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి పౌష్టికాహారం ప్రధానమని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో గీత సూచించారు. జమ్మలమడుగు మండలంలోని మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యం కోసం ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. పిల్లల్లో ఎదుగుదల, మహిళలు ఆరోగ్యానికి గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విశ్వనాథరెడ్డి, జయుడు, శంకర్, ధనుంజయ, పాండు, అంగన్వాడీ కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.


మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రితేశ్‌కుమార్‌రెడ్డి

కొండాపురంలో సామూహిక సీమంతాలు

కొండాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పోషకాహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూర్చుతుందని సీడీపీవో కొండమ్మ తెలిపారు. పోషణ్ పహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్లప్రొద్దుటూరు, దత్తాపురం, సుగుమంచిపల్లె అంగన్వాడీ సెంటర్లలో బుధవారం సామూహిక సీమంతాలు- అన్నప్రాసన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమలో పిల్లలకు, గర్భిణులకు పోషకాహార విలువలు తెలియజేయడంతో పాటు సామూహిక సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు తేజు, నిర్మల, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యమే సమాజానికి భద్రత

బద్వేలు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే సమాజానికి భద్రత అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రితేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తొట్టిగారిపల్లెలో మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసరు శంభుప్రసాద్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు రాజేశ్‌కుమార్, వినయ్‌కుమార్, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

కాశినాయన, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రారంభించిన స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ పుష్ప పేర్కొన్నారు. బుధవారం ఈ పథకాన్ని గంగనపల్లె గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల్లో పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించాలి

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. మండలంలోని వనిపెంట ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు మల్లేష్, జేవీ శ్రీకాంత్, తేజ్‌దీప్, టీడీపీ మండలాధ్యక్షుడు భీమయ్య, మున్సిపాలిటీ అధ్యక్షుడు దాసరి బాబు, మైదుకూరు బీజేపి ఇన్‌చార్జ్ మాచనూరు సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, మోపూరి రమణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

ప్రమాదవశాత్తు ఆసుపత్రి పాలై, డబ్బులు ఖర్చు చేసుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని ఐదుగురు లబ్ధిదారులకు సుమారు రూ.6.20 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.


స్వస్థనారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి

ఖాజీపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారి ఇలియారాణి అన్నారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని షణ్ముఖపల్లెలో సర్పంచ్ చంద్రశేఖర్ స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం 17వ తేదీ నుండి 2వ తేదీ వరకు ప్రతి విలేజ్ క్లీనిక్‌లో అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం సహకరించాలి



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ సహకరించాలని, అప్పుడే అది సాధ్యమవుతుందని డీఎస్పీ భావన తెలిపారు. బుధవారం స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో గంజాయి మత్తు పదార్థాల వినియోగంపై కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ భావన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నుండి యువత భవిష్యత్తును కాపాడే లక్ష్యంలో అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మెడికల్ షాపు యజమానులు డాక్టర్ చీటీ లేకుండా ఎలాంటి మత్తు, హానికరమైన మందులు ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో ఈగల్ ఇంచార్జ్ సీఐ రియాజ్ అహ్మద్, ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి, టూటౌన్ సీఐ సదాశివయ్య, త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాలకు అధ్యక్షుల నియామకాలు

● డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గంలోని పలు మండలాలకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షులను నియమించామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాశినాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పుల్లూరు పెద్ద ఖాజావలి, గోపవరానికి సాంబయ్య, అట్లూరు శీలం గంగయ్య, బి.కోడూరు మండలానికి గుర్రప్పలను నియమించినట్లు తెలిపారు. మండలాల్లో కాంగ్రెస్ బలోపేతానికి పాటుపడాలని కోరారు.

రక్తదాన శిబిరం


రక్తదాతలకు జ్యూస్ ఇస్తున్న సుబ్బరాయుడు

మైదుకూరు, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకలను బుధవారం స్థానిక బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జోనల్ ఇన్‌చార్జ్ యల్లారెడ్డి, మండల అధ్యక్షుడు దేవేంద్ర, రామక్రిష్ణ, చంద్రఓబులరెడ్డి పాల్గొన్నారు.

జమ్మలమడుగు బీజేపీ కార్యాలయంలో..

జమ్మలమడుగు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆయన తమ్ముడు, బీజేపీ నాయకుడు దేవగుడి శివనారాయణరెడ్డి, ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సర్పంచ్ గురుశేఖర్‌రెడ్డి, చౌడం జొల్లు కొండయ్య, పోలీసు చంద్ర, షబ్బీర్, వేపరాల ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, ఎం.చంద్ర, పుల్లారెడ్డి, తోళ్లమడుగు నబి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

అంగీకార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మెప్మా కార్యాలయంలో బుధవారం కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఇతర అధికారులు అంగీకార్ 2.0 సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకార్ 2.0 ఇంటి నిర్మాణాలకు సంబంధించి గత ఏడాదే ప్రారంభించిందన్నారు. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అప్పటి నుంచి కూటమి ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయన్నారు. అందులో భాగంగా ఇంటి నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఒక లక్ష రూపాయలు విడుదల చేస్తుందన్నారు. ప్రభుత్వం వేగవంతంగా ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ మహేశ్వరరెడ్డి, మెప్మా సీవో రమణారెడ్డి పాల్గొన్నారు.

సగరులు రాజకీయాల్లో రాణించాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సగరులు రాజకీయాల్లో రాణించాలని సగర కార్పొరేషన్ రాష్ట్రచైర్మన్ రంగేపల్లి వెంకటరమణ అన్నారు. బుధవారం ఇండ్రస్టియల్ ఎస్టేట్‌లో సగరుల ఆత్మీయ సమావేశం నిర్వహించి ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సగర సామాజిక వర్గం వారు విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తున్నా రాజకీయ రంగంలో పురోగతి సాధించలేదన్నారు. సగరులు రాజకీయంగా అభివృద్ధి చెందడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సగరసంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నీలం బాలగంగాధర్ తిలక్, జిల్లా అధ్యక్షుడు మజ్జారి వీరమోహన్, కోశాధికారి జోడు ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వరికూటి సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి వన్నెంపల్లి వెంకటేష్, పట్టణాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం సీఎంఎస్ పోరాటం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో గత ముప్పై ఏళ్లుగా మహిళల హక్కుల కోసం చైతన్య మహిళా సంఘం పోరాడుతోందని ఆ సంఘం రాష్ట్ర కమిటీ నాయకురాలు పద్మ అన్నారు. బుధవారం స్థానిక ఎన్జీవో హోంలో చైతన్య మహిళా సంఘం ఆవిర్భవించి 30 వసంతలైన సందర్భంగా ఈనెల 24న తొగటవీర కళ్యాణ మండపంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఉద్యోగ కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మహిళలను అన్ని విధాల చైతన్యపరచి వారిని, వారి కుటుంబాలను రక్షించుకునేలా సీఎంఎస్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో అధ్యక్షుడు రఘురామిరెడ్డి, ఉమెన్ వింగ్ చైర్మన్ జయమ్మ పాల్గొన్నారు.

మంచి నిర్ణయాలు తీసుకోవాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎక్కువ మంది మహిళలకు ఆర్థిక స్వావలంబన ఏర్పడేలా ఇంకా మంచి నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఉన్న మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రెయాన్స్‌టైలరింగ్ రెండో బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలు ఉచిత కుట్టుమిషన్లు, ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్లు, ఆర్‌అండ్‌బీ అధికారులు


పోరుమామిళ్లలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డును చూపుతున్న మానవ హక్కుల సంఘం నాయకుడు ఫణిరావు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల రోడ్డు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్లు, ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మానవ హక్కుల నాయకుడు ఫణిరావు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులను సక్రమంగా చేయడం లేదన్నారు. నిద్రమత్తులో రోడ్డుపనులు జరుగుతున్నాయని, పత్రికల్లో వస్తే హడావుడిగా పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఒకపక్క ట్రాఫిక్, మరో పక్క గుంతలు ఉండడంతో ప్రజలు, వ్యాపారస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు పనులను నెలల తరబడి ఆలస్యంగా చేస్తున్నారని, పనులను వేగవంతం చేసి ప్రజల సమస్యలను తీర్చాలని కోరారు.

అడ్డగోలుగా రోడ్డు నిర్మాణ పనులు

పోరుమామిళ్ల రోడ్డు విస్తరణ పనులను అడ్డగోలుగా నిర్మిస్తున్నారని సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవికుమార్ అన్నారు. బుధవారం వారు తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి ఈ రోడ్డు పరిస్థితులపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ఆర్భాటం చేయడం తప్ప కొలతలు వేసి మార్కింగ్ చూపినంత వరకు రోడ్డుపనులు చేయకపోవడం దారుణమన్నారు. రోడ్డు నిర్మాణానికి ఇచ్చిన కొలతలపై ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

దువ్వూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మొక్కుబడిగా కొనసాగింది. ఆయా శాఖల ప్రగతి నివేదికలను అధికారులు వివరించారు. విద్యుత్తు శాఖ పనితీరుపై మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజారెడ్డి చురకలు అంటించారు. రైతులకు యూరియాను కొరత లేకుండా అందిస్తామని మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఉపాధి హామీ పథకం ఏపీడీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూలీలకు రూ.300 తగ్గకుండా వేతనం లభించే విధంగా పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో హరికృష్ణ, మండలాధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పాల్గొన్నారు.

దసరా శరన్నవరాత్రుల పుస్తకాల ఆవిష్కరణ

బద్వేలు/బద్వేలు టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన వాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కొండపల్లె చిన్నసుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆయన సంఘం సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు, కమిటీసభ్యుల ఆధ్వర్యంలో శరన్నవరాత్ర మహోత్సవ ప్రత్యేక పుస్తకాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 రోజులపాటు దసరాఉత్సవాలను గతంలో ఎన్నడూలేని విధంగా అంగరంగవైభవోపేతంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గౌరవఅధ్యక్షుడు కనుమర్లపూటి రామచంద్ర వరప్రసాద్, ట్రజరర్ భూపాలం నాగరాజ, ఉపాధ్యక్షుడు దర్శిసుబ్బరాజ, సత్యనారాయణ, చలపాటి రవికుమార్, జూటూరు నాగరాజ, యాదాళ్లక్రిష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతను తీర్చాలని డిమాండు

చాపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం యూరియా కొరతను తీర్చాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ లక్షుమయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్షుమయ్య, ఉపమండలాధ్యక్షుడు బాలనరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు సుమారు 20 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేసినట్లు చెప్పారు. ఈపైరు సాగు చేసేందుకు కచ్చితంగా యూరియా అవసరం ఉందన్నారు. ఇప్పటికి ప్రభుత్వం 1200 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసిందని, ఇంకా 1139 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. ప్రైవేటు ఫర్టిలైజర్ డీలర్లు బస్తా రూ.350లకు విక్రయించడం తగదన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారానే యూరియాను ప్రభుత్వం పంపిణీ చేయాలని కోరారు. కొంతమంది టీడీపీ నాయకులు యూరియాను ఎక్కువగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఐసీడీఎస్ సీడీపీవో ముంతాజ్‌బేగం మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం కింద మండలంలో 11 మంది పిల్లలకు నెలకు రూ.4 వేలు చొప్పున కేంద్రప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అమ్మానాన్న చనిపోయిన పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద రైతులకు పండ్లతోటలు, మల్లెచెట్లు పంపిణీ చేస్తున్నట్లు ఉపాధి ఏపీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

సిఫారసు మేరకు యూరియా వాడాలి

బి.కోడూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారుల సిఫారసు మేరకు యూరియా వాడాలని వ్యవసాధికారి కౌశిక తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కుమ్మరోనిపల్లె, ప్రభలవీడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వరిలో సస్యరక్షణ, ఎరువుల వాడకం, యూరియా అధికంగా వాడడం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఈనెల 30వ తేదీలోపు పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బ్రహ్మానందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

ఎర్రగుంట్ల సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని జేఏసీ ప్రకటించింది. ఎర్రగుంట్ల మండల పరిధిలోని ఆర్టీపీపీలో బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సార్లు సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. పెండింగ్‌లో నున్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, 1999-2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్య కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా వీరి ధర్నాకు ఆర్టీపీపీ ఇంజనీర్లు మద్దతు తెలిపారు.

మహిళ ఫిర్యాదుపై డీఎస్పీ విచారణ

కలసపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం ఎగువరామాపురంలో ఓ స్థలం విషయంపై బుధవారం సాయంత్రం మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ విచారణ జరిపారు. గ్రామానికి చెందిన లక్ష్మిదేవి స్థలం విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు విచారణపై డీఎస్పీతో పాటు పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు గ్రామంలో ఫిర్యాదుదారులతో పాటు పలువురిని విచారించారు.


ఎస్సీ ఎస్టీ కేసుపై విచారిస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్